## మీ బాల్యం గురించి చెప్పండి

నేను మద్రాసులో 21 డిసెంబర్ 1931న పుట్టాను. అమ్మ తిరుపతమ్మ, నాన్నగారు జగన్నాథరావు గారు. ఇంట్లో నేను అష్టమ సంతానం. నాది చాలా సాదాసీదా బాల్యం. ఎందుకంటే, నేను చిన్నప్పటినుంచీ ఏకాంతజీవిని. నాకెందుకో బాల్యంనుంచే చిలిపితనం ఎక్కువ. మూసి ఉన్న తలుపు కొట్టి దాక్కోవడం లాంటివి ఎక్కువ చేసేవాడిని. ఇప్పటికీ ఎవరైనా ఫోన్లు చేస్తే అప్పుడప్పుడు గొంతు మార్చి మాట్లాడుతుంటాను. ఈ పెంకితనాన్ని మార్చుకోవాలని ప్రయత్నించాను గానీ, అది సాధ్యం కాలేదు. చదువులో మాత్రం ముందుండేవాడిని. మా నాన్న జగన్నాథరావు గారు బ్రిటిష్ వాళ్ల కాలంలోనే డిప్యూటీ కలెక్టరు. ఆయన ఉద్యోగ ధర్మం నిర్వహించిన దానికి దీటుగా, మా అమ్మ కుటుంబ బాధ్యతలను మంచి దక్షతతో నిర్వహించింది. నేను వారి ఆఖరి సంతానాన్ని కనుక వాళ్లనూ వాళ్ల జీవన నిర్వహణా విధానాలను నిశితంగా పరిశీలించే అవకాశం కలిగింది. మానాన్నగారి సత్యసంధత, సమయపాలన, మాటలో నిక్కచ్చితనం, ఆస్తిపాస్తుల కోసం వెంపర్లాడక పోవడం నా తోబుట్టువులందరికంటే నాకు ఎక్కువగా పట్టుబడ్డాయి.




మనవరాలు విద్య, మనవడు వివేక్, అతని భార్య గాయత్రి, కోడలు విజయ, భార్య శారద, కొడుకు జగన్నాథరావుతో...

## ఎప్పటినుంచి కథలు రాయడం మొదలు పెట్టారు?

చిన్నప్పుడు నా జనరల్ రీడింగు మరీ అంత విశాలమైనది కాదు. క్లాసు పాఠాలలో ఇంగ్లీషు, తెలుగు టెక్స్టులలోను నాన్ డిటైల్స్‌లోను తగిలిన కథలూ, పద్యాలూ పరీక్షల్లో మార్కులు ఎక్కువగా సంపాదించుకోవాలనే కోరికతో చదివినా; వాటిలోపలి భావాలూ ఆ కథా వస్తువు సెట్ ఎలూ నా పఠనా చాపల్యం మీద బలమైన ముద్రలు వేశాయి. ఇలాంటి కల్పనలు, కవితలు నేనెందుకు రాయలేను అనే జిగీష కలిగింది. దాని ఫలితమే నా పదిహేనవ యేట అంటే 1947లో చందమామ మాసపత్రికలో వచ్చిన 'పొట్టి పిచిక కథ'

## మీకు బాలసాహిత్యం అంటే ఆసక్తి ఎక్కువా?

అలాగని చెప్పలేను. మాకాలం నాటి స్కూల్ ఫైనల్ చదువుకీ ఇంటర్మీడియట్ చదువుకీ మధ్య నిష్పత్తి లేనంత ఎదుగుదల. ఒక్కసారిగా తెలుగులో దుర్గేశనందిని, దేవి చౌధురాణి వంటి బెంగాలీ అనువాద నవలలు, ఛార్లెస్ లేంబ్ వంటి వచన రచయితల గ్రంథాలు టెన్నిసన్ లాంటి పద్యరచయితల రచనలు మా సిలబస్‌లోకి వచ్చి కూర్చున్నాయి. హాస్యం, వ్యంగ్యం, చమత్కారం ఇష్టం ఉండడం వల్ల చిత్రగుప్త, ఆనందవాణి ముఖ్యంగా తెలుగు స్వతంత్ర పత్రికలలో తక్కువ నిడివితో చెప్పగలిగే కథలు వ్రాశాను. 1948-57 కాలంలో 'తెలుగు స్వతంత్ర' వార పత్రికలో కొన్ని డజన్ల కథలు వ్రాశాను. గోరాశాస్త్రి గారు నా కథలకు టైటిల్స్ మార్చి చమత్కారం చేస్తే అదంతా నేనే చేసినంత ఆనందం కలిగేది. అయితే ఆ మధ్యకాలంలో ఆంధ్రపత్రిక వీక్లీ సుమిత్ర, సుభద్ర అనే రెండు కథలకి బహుమతులు ఇవ్వడం కూడా నాలో ఉత్సాహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచాయి. నాతోటి రచయితలు చాలామంది కంటే సంఖ్యాపరంగా, చమత్కారపరంగా నా స్థానం ప్రత్యేకమైనదని అప్పటి పాఠకులు చెప్పేవారు. ఇప్పుడు కూడా చెబుతున్నారు.



కాశీపట్నం రామారావు గారితో....

## మీ కథల పేర్లు, నవలల పేర్లు అల్లరల్లరిగా ఉంటాయి. ఎందుకలా?

జైకి బహువచనం జైలు, ఎవడితోనైనా లేచి పోరాదూ, అడుగో మావయ్య ఆ వెనకే మేరీ, తమ మగసిరి తగలేసిరి, తమరు కాలం చెయ్యండి తద్దినాలు పెట్టకపోతే అడగండి.. ఇవి నా కథలు, నవలల్లో కొన్నిటి

## నచ్చినవి

| | | |
|---|---|---|
| కథ | : | వడ్లు (అల్లం శేషగిరిరావు) |
| నవల | : | కీలుబొమ్మలు (జి.వి.కృష్ణారావు) |
| రచయితలు | : | విశ్వనాథ సత్యనారాయణ, రంగనాయకమ్మ |
| సినిమా పాట | : | 'లవ్వుకి ఏజు బారుందా రంగనాయకి' |
| సినిమా | : | అనార్కలి |
| నటి | : | సావిత్రి |
| నటుడు | : | నాగయ్య |
| గాయని | : | సునీత |
| గాయకుడు | : | ఎస్పీ బాలు |
| వ్యక్తి | : | భరాగో |
| వంట | : | ఊరేసిన ఉసిరికాయ |



పేర్లు. అలాగే సులువుగా ఇంగ్లీషు నేర్చుకోండి అనే పేరు పెట్టదగిన పుస్తకానికి 'అంగ్రేజీ మేడీజీ' అని పేరు పెట్టాను. ఇంగ్లీషులో 'మిస్చీఫ్ ఈజ్ ద గేమ్ ఆఫ్‌ది ఇంటలిజెంట్ లాట్' (అల్లరి చేయడం తెలివయిన వాళ్లకే సాధ్యం) అని ఒక నుడికారం ఉంది. ఇలా అల్లరి చేసే లక్షణం నాకు చార్లెస్ లాంబ్ ప్రభావం వల్ల కలిగిందని అనుకుంటాను. అల్లరి చేయడం అనేది పిల్లల పని కదా. బహుశా నాలో ఇంకా బాల్యం పోలేదనుకుంటాను. 'పాపం, పుణ్యం ప్రపంచమార్గం ఏమీ తెలియని పిల్లల్లారా! మెరుపు మెరిస్తే, వాన కురిస్తే అది మీ కోసమే అని ఆనందించే అమాయకుల్లారా' అన్నాడు శ్రీశ్రీ. చిన్నతనం పోకుండా చూసుకోడంలో చిన్నతనం ఏమీ లేదు కదా!

### మీ ఉద్యోగ జీవితం గురించి చెప్పండి?

బి.యస్సీ, బి.ఇడీ చదివాను. చదువై పోతూనే స్వస్థలం తునిలోని రాజావారి హైస్కూల్లో చేరాను. కొంతకాలం సైన్సు, లెక్కలు, ఇంగ్లీషు ఏది పడితే అది పాఠాలుగా చెప్పాను. తర్వాత బెనారస్ హిందూ యూనివర్శిటీ ద్వారా ఇంగ్లీషు ఎం.ఏ. పట్టా పొందాను. అనంతరం ఒరిస్సా ఎడ్యుకేషన్ సర్వీసులో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అక్కడ సర్వీసులో ఉండగానే 'జార్జి ఆర్వెల్' అనే పోస్ట్ మోడరన్ థింకర్ వ్రాసిన అయిదు నవలల సబ్జెక్టుగా పిహెచ్‌డీ పట్టా పొందాను. రీడర్‌గా ఉద్యోగ విరమణ చేశాను.

### కథలెలా ఉండాలి?

కథలు ఎలా ఉండాలంటే, ఆహ్లాదకరంగానూ, ఆలోచనాత్మకంగాను వుండాలి.

### మీ పుస్తకాలు, మీరు అందుకున్న అవార్డుల గురించి చెప్పండి...

మొత్తం ఏడు కథా సంపుటాలు, తొమ్మిది నవలలు వెలువడ్డాయి. 'గణిత విశారద', 'కేటూ డూప్లికేటూ' అనే రెండింటితో కలిపి పిల్లలనూ విద్యార్థులను ఉద్దేశించి రాసినవి ఆరు పుస్తకాలు తెచ్చాను. వల్లత్తోల్ నారాయణమీనన్‌పై ఇంగ్లీషులో వచ్చిన మోనోగ్రాఫ్‌ను 1977లో తెలుగులోకి అనువదించాను. నా మొదటి కథల పుస్తకం 'అర్థమున్న కథలు' 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు పొందింది. యిక చిన్నా చితకా సంస్థలనుంచి అరడజనుకు పైగానే అవార్డులు అందుకున్నాను.

### యిప్పటి కథలెలా ఉన్నాయి?

ఇప్పటి కథల్లో మంచీ, చెడూ రెండూ ఉంటున్నాయి. అయితే చాలామంది మంచి కథలే రాస్తున్నారు. ఇక టివి, సినిమాలతో పోలిస్తే – కథారచనలో అంతగా పతనం లేదు. ఇప్పటి కుర్రాళ్లు చాలా బాగా రాస్తున్నారు. ఈ తరానికి కథారచన బాగా తెలుసు! ఇలాగే ఈతరం నిండునూరేళ్ళూ వర్ధిల్లాలని ఆశిస్తున్నాను.

### మీ జీవితంలో మరచిపోలేని సందర్భం ఉందా?

ఉందండి. చాలా ఏళ్లుగా అటు తెలుగు కథలు రాసి, ఇటు ఇంగ్లీషు పాఠాలు చెప్పి అసంఖ్యాక వ్యక్తుల ప్రేమాభిమానాలను అందుకోవడం నా అదృష్టం. అనుకోని ఉపకారాలు పొందడం నా భాగ్యం. ఈ మధ్య హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రికి వెళ్లాం. అక్కడి పెథాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ నన్ను చూడగానే ''మేస్టారూ..నన్ను గుర్తుపట్టారా?'' అంటూ పలకరించింది. నేనయితే గుర్తుపట్టలేదు. సుమారు యాభై ఏళ్లకిందట, మేము కొంతకాలం తునిలో ఉన్నాం. అప్పుడు ఆ అమ్మాయికి ఐదేళ్ల వయసు. తర్వాత ఇదే చూడ్డం. చూస్తూనే నన్ను గుర్తుపట్టి పలకరించింది. ఇది నిజంగా నా జీవితంలో మరచిపోలేని సంఘటన.

### బాధ కలిగిన సందర్భాలున్నాయా?

ఎందుకుండవండి. ఉంటాయి. అయితే బాధలను మాయం చేసే, లేదా బాధలను మించిన మధురమయిన సందర్భాలు జీవితంలో ఎన్నో ఉన్నాయి. దానికి తోడు బాధలను గుర్తు పెట్టుకోనంత గుండెదిటవు నాకుంది. అందువలన ప్రత్యేకించి గుర్తుచేసుకుని బాధపడే సందర్భాలు లేవనే చెప్పాలి.

### మీ దాంపత్య జీవనం ఎలా సాగింది?

నా భార్య శారదదీ, నాది భిన్న దృక్పథాలు. అంటే నేను హేతువాదిని. తను ఆధ్యాత్మిక శీలి. ఆవిడ పదిమందితో కలిసే మనిషి. ఎప్పుడు గుళ్లనీ, వ్రతాలని తన వ్యాపకాల్లో తానుంటుంది. నేను ఏకాంత జీవినన్నాను కదా, నేనేమో పుస్తకాలు చదువుకోవడం, రాసుకోవడం– నాలోకంలో నేనుండేవాడిని. మాకు ఒకబ్బాయి. తను ఇంజనీర్. హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. మా అబ్బాయి రమ్మంటే వైజాగ్‌నుంచి హైదరాబాద్‌కు వచ్చేశాము. 'లవ్వుకు ఏజు బారుందా రంగనాయకి' అనేపాట నాకు చాలా యిష్టం. ప్రేమకు వయసుతో సంబంధం లేదు. ప్రేమ లక్షణాలుంటే ఎప్పుడయినా, ఎక్కడయినా హాయిగా జీవించవచ్చు.

**– ఎన్.కనకలత**

